సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 29 । జూన్ । 2024



కా'పాడి' తీరాలి

పాడి పశువులను సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడాలి. వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి.
- 8లో



వేంకటేశ్వర ఆలయంలో చోరీ

పాతపట్నంలోని వేంకటేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. స్వామి ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- 8లో

ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు అనుమతులివ్వాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వహణకు అనుమతులు ఇవ్వాలని జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమన్య అసోసియేషన్ సభ్యులు కోరారు. అమరావతిలో శుక్రవారం ప్రిన్సిపాల్ సెక్రటరీ సౌరభ్‌గౌర్‌ను శుక్రవారం కలిసి తమ సమస్యలు వివరించారు. లాంగు లీజ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, ఈఓపీ గడువు పొడిగించాలని, వర్సిటీ అఫిలియేషన్ మంజూరు చేయాలని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లో ప్రవేశాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

టాపర్‌కు అభినందన




రుక్మిణి, ఆమె తల్లిని సన్మానిస్తున్న ఆర్‌జేడీ శోభారాణి, ప్రిన్సిపాల్ గోవిందమ్మ తదితరులు

టెక్కలి: పీజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని నీలాపు రుక్మిణి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్‌జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి కొనియాడారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థిని రుక్మిణితో పాటు ఆమె తల్లిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ పీజీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన రుక్మిణిని మిగిలిన విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకుడు డి.వాసుబాబుతో పాటు ఇతర అధ్యాపకులు వి.ల్యూక్‌పాల్, ఎ.రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'డీవైఈఓ ఉద్యోగాల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి'

కవిటి: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీవైఈఓ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన రాతపరీక్ష ఫలితాల ప్రకటన లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని యూటీఎఫ్ సంఘం నేత మురళీప్రకాష్ డిమాండ్ చేశారు. ఇద్దివానిపాలెం పాఠశాల ఆవరణలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పరీక్ష ఫలితాలపై వారి అభ్యంతరాలను వెల్లడించారు. ఈ ఫలితాల ప్రకటనలో చోటుచేసుకున్న విధానాలు సరిదిద్దకుంటే నిజమైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి సరైన రీతిలో తమకు న్యాయం దక్కకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేదని అన్నారు. డీవైఈఓ ఉద్యోగాలకు నిర్వహించిన ఉద్యోగపరీక్ష ఫలితాలకు సంబంధించి మార్కులతో కూడిన మెరిట్ లిస్టు విడుదల చేయాలని, ప్రిలిమ్స్‌లో కూడా రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ ఫాలో అవ్వాలని కోరారు. తమ డిమాండ్లపై పునరాలోచన చేసి ఎంపిక ప్రక్రియ పునఃసమీక్ష చేయాలన్నారు.

ఇసుక దొరికేదెప్పుడు.?



- జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న ఇసుక కొరత
- నూతన విధానం అమల్లోకి రాక లభించని ఇసుక
- రెండు నెలలుగా పనుల నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న భవన నిర్మాణ కార్మికులు

నరసన్నపేట: నదుల్లో ఇసుక ఉంది. తవ్వకాలకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. నిల్వలు కూడా సమృద్ధిగా ఉన్నాయి. కానీ రెండు నెలలుగా జిల్లాలో ఇసుక కొరత నెలకొంది. ఫలితంగా భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయి.. కార్మికులకు ఉపాధి కరువైంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రోజులు, వారాలు గడుస్తున్నా నూతన ఇసుక విధానం అమల్లోకి తీసుకురాకపోవడంతో ఎవరికీ ఇసుక దొరకడం లేదు. ఉచితంగా ఇసుక ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించింది. ఉచిత ఇసుక కోసం జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇసుక అంతంతమాత్రంగానే దొరికేది. ఈ నెల 1వ తేదీ నుంచి ఇసుక తవ్వకాలు పూర్తిగా నిలిచి పోయాయి. రోజుకు వందలాది లారీల్లో ఇసుక జిల్లాతో పాటు విశాఖకు భవన నిర్మాణాల కోసం తరలిస్తుంటారు. అలాంటిది ప్రస్తుతం ఒక్క లారీ



నరసన్నపేట మెయిన్ రోడ్డులో మార్చు పక్కన ఇసుక లభించక నిలిచిపోయిన భవనం స్లాబ్

కూడా అధికారికంగా వెళ్లడం లేదు. దొంగతనంగా మాత్రం కొందరు ఇసుక లారీలను తరలిస్తున్నారు. పోలీసులు కూడా కొన్నింటిని పట్టుకున్నారు.

ఇతర వ్యాపారాలపైనా ప్రభావం..

ఇసుక కొరతతో భవన నిర్మాణాలు నిలిచి పోవడంతో సిమ్మెంటు, ఐరెన్‌తో పాటు గృహోపకరణాల వ్యాపారాలు కూడా పూర్తిగా మందగించాయి. సిమ్మెంటు వ్యాపారం అయితే 70 శాతం మేర పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లాలో వందలాది సిమ్మెంటు షాపులు ఉన్నాయి. వీరందరూ వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ఉచిత ఇసుక ఇంకెన్నాళ్లకు..?

కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఉచిత ఇసుకపై హామీ ఇచ్చాయి. కూటమి అధికారంలోకి రావడంతో జిల్లా ప్రజలు ఉచిత ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విధానం అమలైతే ఇసుక ధరలు బాగా తగ్గుతాయని భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం ప్రస్తుతానికి దీనిపై దృష్టి సారించకపోవడంతో నిరాశ తప్పడం లేదు. మొదటి కేబినేట్ సమావేశంలో ఇసుక విధానంపై ఒక నిర్ణయానికి వస్తారని అంతా భావించారు. ఇళ్ల పనులు ఊపందుకుంటాయని అటు భవన నిర్మాణ కార్మికులు ఆశించారు. కానీ అలా జరగలేదు. రెండు రోజులు ఇసుక దొరక్కపోతేనే పనులన్నీ నిలిచిపోతాయి. అలాంటిది సుమారు రెండు నెలలుగా ఇసుక దొరక్కపోవడంతో నిర్మాణదారులు, కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో పక్క వర్షాలు అధికమైతే నదుల్లో నీరు చేరి మళ్లీ ఇసుక తవ్వకాలకు ఇబ్బందవుతుందని జిల్లా వాసులు భావిస్తున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే భవన నిర్మాణ కార్మికులు వీధిన పడతారని, భవన నిర్మాణ రంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక లభించడం లేదు



వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న మా ఇళ్ల మోడరేషన్ చేయడానికి పనులు చేపట్టాం. అన్ని ఏర్పాట్లు చేశాం. తీరా పనులు ప్రారంభిస్తామనే సరికి ఇసుక లభించడం లేదు. దీంతో పనులు నిలిచి పోయాయి. 20 రోజులు పైనే అవుతుంది. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. తాపీ మేస్త్రీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. – మార్పు విజయ్, ఇందిరా నగర్

నెల రోజులుగా పనుల్లేవు



గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. నెల రోజులవుతోంది పనులు దొరికి. ఇసుక లేకపోవడం వల్లే ఈ దుస్థితి. ఇన్ని రోజులు ఇసుక దొరక్కపోతే ఎలా..? రోజూ పనికి వెళ్తేనే మాకు పూట గడుస్తుంది. అలాంటిది నెల రోజులుగా పనుల్లేవు. కష్టంగా ఉంది. ఇసుక విధానం వెంటనే ప్రకటించి ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలి. – విశ్వనాథం, బొరిగివలస కాలనీ

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం



ఇసుక కొరతతో భవన నిర్మాణ పనులు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. నాటు బళ్లపై ఇసుక వస్తున్నా ఏమంత ప్రయోజనం ఉండటం లేదు. ఇసుక కొరత సమస్య వెంటనే పరిష్కరించాలి. – సూరపు కుమార్, బొరిగివలస

షెడ్యూల్ మేరకు ఆర్‌జీయూకేటీ ప్రవేశాల కౌన్సెలింగ్



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రవేశాలు షెడ్యూల్ మేరకు నిర్వహించనున్నట్లు ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం క్యాంపస్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో నాలుగు క్యాంపస్‌లకు కలిపి ప్రవేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు క్యాంపస్‌ల్లో 4400 సీట్లు ఉండగా, 53,835 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,151, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671, పక్క రాష్ట్రాల నుంచి 38 వచ్చాయని అన్నారు. ఇందులో అమ్మాయిలు 30,857, అబ్బాయిలు 23,006 మంది ఉన్నారని చెప్పారు. ప్రత్యేక కేటగిరీ రిజర్వేషన్లకు సంబంధించి క్యాప్ 2582, ఎన్‌సీసీ 1830, స్పోర్ట్స్ 1162, దివ్యాంగులు 332, స్కౌట్స్ అండ్ గైడ్స్ 270 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల దరఖాస్తుల పరిశీలన జూలై 1 నుంచి 3వ తేదీ వరకు నూజివీడు క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యాంపస్‌ల వారీగా ఎంపిక జాబితాలు జూలై 11న విడుదల చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి ఎస్ఎంపురం క్యాంపస్‌లో జూలై 26, 27 తేదీల్లో ఉంటుందని అన్నారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన సమయంలో కచ్చితంగా ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని అన్నారు.



కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ

'శివారుకు వంశధార నీరివ్వాలి'



మాట్లాడుతున్న గోవిందరావు, కృష్ణమూర్తి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వంశధార కాలువలకు షట్టర్స్ బిగించి శివారు భూములకు నీరివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని డీసీసీబీ కాలనీలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. వంశధారలో నీరున్నప్పటికీ రైతులకు నీరందకపోవడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనన్నారు. 900 టన్నుల షట్టర్స్ గోదాంలో మూలుగుతూ తుప్పు పడుతున్నాయని, వాటిని ఎందుకు బిగించడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. వంశధార ఎడమ కాలువకు కొత్త షట్టర్స్ బిగించకుండా శివారు భూములకు నీరు ఎలా ఇస్తారో చెప్పాలన్నారు. వంశధార ఎడమ కాలువ పొడవు 105 కిలోమీటర్లు అందులో 60 కిలోమీటర్లు హిరమండలం నుంచి టెక్కలి వరకు ఉన్న అన్ని షట్టర్స్, మధుములు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటికి తక్షణమే మరమ్మతులు చేయకపోతే కాలువలో నీరు వెళ్లే పరిస్థితి లేదన్నారు. ఎడమ కాలువకు 68 పిల్ల కాలువలు, కుడికాలువకు 37 పిల్ల కాలువలు పూర్తిగా మరమ్మతు చేయాలన్నారు.. వంశధార కాలువను ఆపరేట్ చేయడానికి గతంలో 200 మంది లష్కర్లు ఉండేవారని నేడు 20 మంది మాత్రమే ఉన్నారని దీంతో కాలువ మెయింటెనెన్స్ కూడా జరిగే పరిస్థితి లేదన్నారు. జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వంశధారపై పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. వంశధార బ్యారేజ్ పూర్తయి 50 ఏళ్లు అయ్యిందని మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం 50 ఏళ్లు పూర్తయిన ప్రాజెక్టులకు ఆధునికీకరణ చేయాల్సి ఉన్నా పట్టించుకోకుండా ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వంశధార కాలువల ఆధునికీకరణకు సుమారు రూ.1000 కోట్లు అవసరం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కొత్త షట్టర్స్ బిగించి, ఆధునికీకరణ చేసి మధుములు, కాలువలు మరమ్మతులు చేయాలని కోరారు. లష్కర్లను నియమించి కొండపేట ఎత్తిపోతలకు పథకం మరమ్మతులు చేసి నీరివ్వాలని డిమాండ్ చేశారు.



● కడలి కల్లోలం

వాతావరణ మార్పులతో అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్రం ముందుకు దూసుకొచ్చింది. సముద్రం నీరు సుమారు 100 మీటర్లు తీరం వైపు రావడంతో కొంతమేర కోతకు గురైంది. సముద్రం ముందుకు రావడంతో తీరానికి వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలకు దిగేందుకు సాహసించలేదు. అలాగే మత్స్యకారులు సైతం ఆందోళన చెందారు. - వజ్రపుకొత్తూరు రూరల్

మెగా జాబ్‌మేళాకు అనూహ్యస్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించింది. బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 554 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. వివిధ లిఖిత, మౌఖిక పరీక్షల అనంతరం 159 మందిని ఎంపిక చేశారు. వీరికి జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ నియామక పత్రాలు అందజేశారు.

నచ్చిన రంగంలో నైపుణ్యం సాధించాలి: కె.సుధ

అంతకుముందు జరిగిన జాబ్‌మేళా ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి కె.సుధ మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని, నచ్చిన రంగంలో ప్రావీణ్యత, నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, వివిధ సంస్థల ప్రతినిధులు సీహెచ్ శ్రీధర్, అప్పలరాజు, పవన్, వినోద్, వేదవ్యాస్, వంశీ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ, వెంకట్ ఉజ్వల్

తలనీలాల టెండర్ వాయిదా

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన తలనీలాల టెండర్/బహిరంగ వేలం వాయిదా వేస్తున్నట్లుగా ఆలయ ఈఓ/డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఆలయానికి చెందిన తలనీలాలకు, ప్రసాదాల తయారీలో రసవర్గాలు, పచారీ సరుకుల సరఫరాకు శుక్రవారం సాయంత్రం టెండర్లు నిర్వహించారు.

శ్రీకూర్మం ఆలయ ఈఓ గురునాథరావు పర్యవేక్షక అధికారిగా వ్యవహరించగా, ఆలయ ప్రధానార్చకులు శంకరశర్మ సమక్షంలో ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. అయితే తలనీలాల టెండర్ల విషయంలో గత ఏడాది పాట రూ.91 లక్షల కంటే ఇప్పుడు తక్కువగా పాట పాడిన కారణంగా నిబంధనల ప్రకారం ఈ వేలంపాటను రద్దు చేశామని, అలాగే ప్రసాదాలు, అన్నదాన ప్రసాదాలకు అవసరమైన పచారీ సరుకులు, రసవర్గాల టెండర్ ప్రక్రియలో భాగంగా ఐదుగురి నుంచి టెండర్/ డాక్యుమెంట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించారు. శనివారం సాయంత్రం ఈ-టెండర్‌ను కూడా ఓపెన్ చేసి తుదిగా టెండర్‌ను ఖరారు చేయనున్నామని ఆలయ ఈఓ చంద్రశేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి రంజిత్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



టెండరు ప్రక్రియలో పాల్గొన్న ఈఓలు చంద్రశేఖర్, గురునాథరావు, ప్రధానార్చకులు శంకరశర్మ

● జంటలను కలిపి.. బతుకులను నిలిపారు



కోటబొమ్మాళి కోర్టులో దండలు మార్చుకున్న దంపతులతో జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత, న్యాయవాదులు, పెద్ద మనుషులు

నిండు నూరేళ్లు కలిసి జీవించాల్సిన భార్యాభర్తలు తమ వైవాహిక జీవితంలో చిన్నపాటి తగాదాలతో పట్టుదలకు పోయి ఏకంగా విడిపోవాలనుకున్నారు. దీని కోసం కోర్టుకు సైతం వెళ్లారు. కానీ వారందరికీ నచ్చజెప్పి మళ్లీ కలిసి జీవించేలా చేశారు కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత. శుక్రవారం కోర్టు హాల్‌లో ఈ వాదోపవాదాలు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని నరసన్నపేట, అంపోలు, చెన్నయ్యవలస, కోటబొమ్మాళి గ్రామాలకు చెందిన రఘుపాత్రుని శోభారాణి-రవిశంకర్, పైలా అప్పన్న-రాజేశ్వరి, బొమ్మాళి వేణుగోపాల్-వరలక్ష్మీ, ముద్దాడ గోపాలం-లక్ష్మీ విడాకుల కోసం కోటబొమ్మాళి కోర్టును ఆశ్రయించారు. మెజిస్ట్రేట్ ప్రసన్నలత శుక్రవారం వారిని కోర్టుకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అందరికీ చక్కగా నచ్చజెప్పి మళ్లీ కలిసి జీవించేలా ఒప్పించారు. దీంతో ఐదుగురు దంపతులు మళ్లీ పూలదండలు మార్చుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించారు. దీంతో కోర్టులో న్యాయవాదులు, సిబ్బంది, పెద్ద మనుషులుగా వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. జంటలను ఒక్కటి చేసిన మెజిస్ట్రేట్ అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీ డి.హరిప్రియ, ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, కె.అచ్చెన్నాయుడు, వి.అప్పలనాయుడు, సీహెచ్ వెంకటరావు, యు.తిరుమలరావు, కె.మన్మథరావు పాల్గొన్నారు. -కోటబొమ్మాళి

● ప్రాణాలు కాపాడారు

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించిన వ్యక్తిని రైల్వే పోలీసులు కాపాడారు. మెళియాపుట్టి మండలం పెద్దమడి గ్రామానికి చెందిన తెంబూరు రాము అనే నలభై రెండేళ్ల వివాహితుడు శుక్రవారం పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుని రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై పరిగెడుతూ కనిపించాడు. ఆన్ డ్యూటీలో ఉన్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సీసీ కెమెరాల్లో ఆయన కదలికలు గమనించి వెంటనే ఆయనను వెంబడించారు. అతను పరిగెడుతూ వెళ్లి ఎగువ లైన్‌లో కదులుతున్న రైలు ముందుకు ఉన్న ఇంజిన్ కింద పడుకున్నాడు. అంతలో పోలీసులు ఆయనకు బలవంతంగా బయటకు లాగి ప్రాణాలు కాపాడారు. అనంతరం ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు. భార్యతో మనస్పర్థలు రావడంతో చనిపోవడానికి నిర్ణయించుకున్నానని అతను తెలిపాడు. పెద్దమడి సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, అతని భార్య అన్నపూర్ణ సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో జీఆర్పీ హెచ్‌సీ పి.కోదండరావు, కానిస్టేబుళ్లు సంతోష్, నాగార్జున, తేజ, లోకనాథం, ఆర్పీఎఫ్ సిబ్బంది మిశ్రా ఉన్నారు. - కాశీబుగ్గ



రాముతో భార్య అన్నపూర్ణ, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

క్లుప్తంగా

'వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి'


గంగరాపు సింహాచలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా అభివృద్ధి కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక ప్యాకేజీ ఇస్తానని చెప్పి సీఎం చంద్రబాబునాయుడు మాట ఇచ్చారని, ఆ హామీని తక్షణమే అమలుచేయాలని నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగరాపు సింహాచలం కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొత్తూరు వచ్చిన చంద్రబాబునాయుడు అందరికీ న్యాయం చేస్తానని చెప్పారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు. మీరిచ్చిన హామీని నమ్మి వంశధార నిర్వాసితులు మీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావును భారీ మెజార్టీతో గెలిపించిన సంగతి మీరు మర్చిపోరని తాము భావిస్తున్నామన్నారు.

జనావాసంలో పాము కలకలం


చెట్టుపైన ఉన్న భారీ పాము

టెక్కలి రూరల్: కొద్ది రోజులుగా టెక్కలి పరిసరాల్లో పాములు కలకలం రేపుతున్నాయి. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ సమీపంలోని నివాస గృహాల వద్ద శుక్రవారం భారీ పాము కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చెట్టు కొమ్మల పైనుంచి ఆ పాము ఇళ్లలోకి ప్రవేశించడంతో వారంతా బయటకు పరుగులు తీశారు. సుమారు ఆరు అడుగులు ఉన్న ఈ పాము ఇంటిలోకి జొరబడడంతో దాన్ని బయటకు పంపేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. చివరకు బయటకు వచ్చిన ఆ పాము అక్కడ నుండి సమీప చెట్లపైకి వెళ్లిపోయింది.

ఏఐఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తైక్వాండో శ్రీను

శ్రీకాకుళం: అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తైక్వాండో శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సూచనల మేరకు వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకి హరికృష్ణ నియామక ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేశారు.

విధుల్లో చేరిన కొత్త ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్: ఏఎస్‌ఐల నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన కె.మన్మధరావు, ఎస్.కృష్ణారావు, ఎం.సుధాకర్‌లకు స్పెషల్ బ్రాంచ్, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పీఎస్‌లో పోస్టింగ్ ఇస్తున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో వారంతా విధుల్లో చేరారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శ్రీనివాసరావు

శ్రీకాకుళం రూరల్: దీర్ఘ కాలిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఇచ్చిన వివరాలు మేరకు.. శ్రీకాకుళం పరిధిలోని సివిల్ సప్లై కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న రొక్కం శ్రీనివాసరావు (43) గత పదేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడుతున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్వస్థలం కోటబొమ్మాళి మండలం నీలంపేట గ్రామం. ఇతనికి భార్య, ఏడేళ్ల పాప ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కాపాడి తీరాలి..

- పసిరిక మేతతో పశువుల్లో గొంతువాపు
- ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలి


పంట పొలాల్లో పచ్చిక మేత వేస్తున్న పశువులు

శ్రీకాకుళం రూరల్: తొలకరి ప్రారంభమైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చేలల్లో పచ్చిక పెరుగుతోంది. వీటిని పశువులు తింటే వాటిలో ఉండే బ్యాక్టీరియా వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో వచ్చే వ్యాధుల్లో హెచ్‌ఎస్ (గొంతువాపు వ్యాధి) ఒకటి. పశువుల్లో సీజనల్ వ్యాధులను ముందుగానే గుర్తించాలి. అలా గుర్తిస్తే చికిత్స చేయడం సులభమవుతుంది.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో పసిరిక మేతను పశువులు తినడంతో ప్యాశ్చురుల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియా కారణంగా పశువులకు గొంతువాపు వ్యాధి సోకుతుంది. దీని ప్రభావం తీవ్రమైతే పశువులు మృత్యువాత పడతాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు కేవలం పాడి రంగాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు. పశువుల ఆరోగ్య భద్రత దృష్ట్యా పాడి రైతుల పశువులకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్‌ను అందించాల్సి ఉంటుంది.

వ్యాధి లక్షణాలు

- అన్ని రకాల పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయి.
- పశువులకు అధిక జ్వరం 104 డిగ్రీలు పైబడి వస్తుంది.
- సకాలంలో గుర్తించకపోతే వారం రోజుల్లోనే పశువు మరణించవచ్చు.
- బలమైన పశువుల కంటే దూడలకు ఈ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉంది.
- వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హిమరైజ్‌తో నివారించవచ్చును.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు పడి పచ్చ మేత అధికమవుతున్న తరుణంలో ఈ వ్యాక్సిన్‌ను వేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వర్షాలు పడిన తర్వాత మొలకెత్తే పసిరిక మేతలోని చిగురుల్లో ఈ ప్రమాదకర బ్యాక్టీరియా దాగి ఉంటుంది. దీంతో గడ్డిని తిన్న పశువులకు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నాయి. ముందస్తు వ్యాక్సిన్ పశువులకు వేస్తే వాటికి ఎలాంటి ప్రమాదం ఉండదని పశువైద్యులతో పాటు పాడి రైతులు చెబుతున్నారు.

అప్రమత్తత అవసరం

పశువులకు సోకే గొంతువాపు వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. మండల కేంద్రంలోని 18వేల ఆవులు, గేదెలు ఉన్నాయి. ఎక్కువగా సీజనల్ వ్యాధులు పశువులకు సోకుతుంటాయి. ఇలాంటి సమయంలో హెచ్‌ఎస్ (హేమరేజిక్ సెప్టిషిమియా) అనే వ్యాక్సిన్‌ను ఏడాదికి ఒకసారి వేయించుకోవాలి. ప్రసుత్తం అన్ని మండల కేంద్రాల్లో గల పశువులకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతోంది. – డాక్టర్ దిలీప్, పశు వైద్యాధికారి

ఆశ్రమ నిర్వహణకు 'పోలాండ్' ఉద్యోగుల ఔదార్యం


సాయం అందించిన పోలాండ్ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేస్తున్న ఆశ్రమవాసులు

కంచిలి: ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామ యువకులు కొందరు పోలాండ్ దేశంలో విధులు నిర్వహిస్తున్నారు. కంచిలి మండల పరిధి మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు తమ వంతు సాయంగా రూ.58,285లు విరాళాన్ని ఆశ్రమ నిర్వాహకులను శుక్రవారం లొద్దపుట్టి గ్రామస్తులు అందజేశారు. ఈ ఆశ్రమంలో ఉన్న అనాథలు, వికలాంగులు, వయోవృద్ధులకు, గిరిజన విద్యార్థులకు తమ వంతుగా మౌలిక సౌకర్యాలు, ఆహారం అందించడానికి ఈ సాయాన్ని అందించారు. ఈ సాయం పొందిన ఆశ్రమ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

'గిరిజన గ్రామాల్లో డోలీ వ్యవస్థను నిర్మూలించండి'


కేంద్ర గిరిజన శాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న వాబ యోగేశ్వరరావు

సారవకోట: ఆదివాసీ గ్రామాల్లో రోడ్లు వేసి డోలీ వ్యవస్థను నిర్మూలించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగేశ్వరరావు కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. పలు ఆదివాసీ గ్రామాల్లో ఆస్పత్రులకు వెళ్లేందుకు డోలీలు ఇంకా కడుతున్నారని, అలాంటి గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు సదుపాయం కల్పించాలని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నం, సారవకోట మండలాలలో ఉన్న 50పైగా గిరిజన గ్రామాలకు రోడ్డు మార్గం లేదని ఆయా గ్రామాలకు రోడ్డు మార్గాలు కల్పించాలన్నారు. అలాగే మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆయనను కోరారు.

శాంతినగర్ కాలనీలో వైద్యాధికారుల పరిశీలన


శాంతినగర్ కాలనీలో మురుగునీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న అధికారులు

అరసవల్లి: నగరంలోని శాంతినగర్ కాలనీలో పారిశుధ్య పరిస్థితులను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. స్థానికంగా ఉన్న బాలుర వసతి గృహంలో డయేరియా జ్వరాల ప్రభావం కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ వసతి గృహంలో 110 మంది పిల్లలకు డెంగీ, మలేరియా తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపుగా అందరికీ నెగెటివ్‌గా తేలిందని అధికారులు ప్రకటించారు. ఈ ప్రాంతంలో దోమల నిల్వల కేంద్రాలు, మురుగునీటి కాల్వల వద్దకు వెళ్లి ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి, జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, డాక్టర్ సుజాత తదితరులు ఉన్నారు.

'గన్‌మెన్‌లు అవసరం లేదు'

ఆమదాలవలస: నిరంతరం ప్రజల మధ్య ఉండే తనకు గన్‌మెన్‌లు అవసరం లేదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఇటీవల శాసనసభ్యుడిగా ఎన్నికైన రవికుమార్‌కు గన్‌మెన్‌లను నియమించారు. వారు కూన ఇంటికి చేరుకోగా.. తనకు వ్యక్తిగతంగా శత్రువులు ఎవరూ లేరని గన్‌మెన్‌ల అవసరం లేదని సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

మహిళపై దాడి కేసులో ప్రధాన నిందితురాలు అరెస్టు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం నవభారత్ సమీపంలో నివాసముంటున్న దాసరి మంగను ఆటోలో తీసుకెళ్లి చిత్ర హింసలకు గురి చేసిన కేసులో పరారీలో ఉన్న అల్లుబిల్లి రాధను ఎచ్చెర్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసులో పలు క్రిమినల్ సెక్షన్ల కింద ఆరుగురిపై కేసు నమోదు కాగా, ఇప్పటికే 18వ తేదీన ఐదుగురిని అరెస్టు చేశారు. వీరు రిమాండ్‌లో ఉండగా, తప్పించుకొని తిరుగుతున్న రాధను శుక్రవారం దమ్మల వీధిలోని స్వగృహంలో పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, శ్రీకాకుళం కోర్టులో హాజరు పర్చగా, జూలై రెండో తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ కేసు దమ్మల వీధిలో సంచలనంగా మారింది.

'విద్యార్థుల అస్వస్థతపై నివేదిక ఇవ్వండి'

శ్రీకాకుళం అర్బన్: బలగ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ వసతిగృహంలోని 9 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని శుక్రవారం శ్రీకాకుళం ప్రభుత్వ సర్వ జనాస్పత్రిలో చేరారు. ఈ విషయంపై తక్షణ నివేదిక అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఏ ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారో పూర్తి సమాచారంతో నివేదిక అందించాలని అన్నారు. దీని ఆధారంగా తమ కమిషన్ చట్ట ప్రకార చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నట్టు సీతారాం తెలిపారు.

తోటపల్లి కుడి ప్రధాన కాలువకు సాగునీరు విడుదల


కాలువకు హారతిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

పార్వతీపురం: సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు నుంచి శివారు భూములకు సాగునీరు సరఫరా చేస్తామని రాష్ట్ర శిశు సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు కురుపాం, పాలకొండ, పార్వతీపురం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, బోనెల విజయ్‌చంద్రతో కలిసి శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. నదికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ కాలువల్లో పూడికలు, తుప్పలను తొలగించి సాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండల ప్రజలకు సాగునీరు సరఫరాకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. తోటపల్లి, జంఝావతి, పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పనులను పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ఐటీడీఏలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, అవసరమైన నిధులను తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. ఏనుగుల తరలింపు విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి మాట్లాడుతూ రైతులు పంటలు వేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజినీరు ఎస్.సుగుణాకర్‌రావు, పర్యవేక్షక ఇంజినీరు రాజరాజేశ్వరి, కార్యనిర్వాహక ఇంజినీర్లు జి.రామచంద్రరావు, ఆర్.అప్పలనాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు టి.రఘునందన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఆయకట్టు ఇలా...

తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, పాత కుడి, ఎడమ కాలువల ద్వారా 1,31,221 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో పార్వతీపురం మన్యం జిల్లాలో బలిజిపేట, సీతానగరం మండలాల్లోని 27 గ్రామాల పరిధిలోని 13,684 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లోని 105 గ్రామాల పరిధిలోని 38,975 ఎకరాలకు, విజయనగరం జిల్లాలోని రాజాం, వంగర, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెల్లిమర్ల, పూసపాటిరేగ, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, వంగర మండలాల్లోని 66 గ్రామాల పరిధిలోని 25,060 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నారు. అలాగే, ప్రాజెక్టు పాత రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల ద్వారా 64 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది.

సాగునీటి సమస్యలు పరిష్కరించండి

గరుగుబిల్లి: జిల్లాలో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేసి, రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె దృష్టికి సాగునీటి సమస్యలను తీసుకెళ్లారు. వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, రావాడగెడ్డ, తోటపల్లి ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ, పెదబుడ్డిడి వద్ద ఆక్విడెక్ట్ పెండింగ్ పనులు, భామిని మండలం కొండలోయ గెడ్డ, వడ్డంగి లిఫ్ట్‌ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరుచేసి పనులు చేపట్టాలని కోరారు.

ఒడిశా ప్రభుత్వంతో జంఝావతి ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులను తొలగించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి 24 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యమిచ్చి పనులు పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట రైతు సంఘ నాయకులు ఇ.వి.నాయుడు, లక్ష్మీనారాయణ, వైకుంఠరావు, గౌరునాయుడు ఉన్నారు.

పశువ్యాధులపై పాడి రైతులకు అవగాహన


మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన పెంపొందించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు(ఏడీ) మంచు కరుణాకరరావు పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశు సంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంటుందని, సకాలంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. పశువైద్యుల పరిధిలోని గ్రామాల్లోకి వెళ్లి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. పశువుల్లో జబ్బవాపు, గొంతువాపు, చిటిక వ్యాధి నివారణ టీకాలు పశువైద్య సిబ్బందితో వేయిస్తున్నామన్నారు. 21వ అఖిల భారత పశుగణన సెప్టెంబర్ నెలలో ప్రారంభించనున్నామని, ఇప్పటి నుంచి ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సెక్స్‌సార్టెడ్ సీమన్‌పై పాడి రైతుల్లో అవగాహన పెంచాలని, తద్వారా ఆడజాతి దూడలు ఎక్కువగా గ్రామాల్లో వృద్ధి అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాలు, దూడ ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో పశువైద్యులు పి.అనిల్ కుమార్, బి.శ్రీవాణి, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ


సీఐ సాయి సమక్షంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

పాతపట్నం: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వెంకటేశ్వర ఉత్సవ విగ్రహానికి అలంకరించిన వెండి వస్తువులు, హుండీలో సుమారు రూ.40 వేలు నగదును అపహరించారు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో గురువారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో గుర్తుతెలియని నలుగురు యువకులు వచ్చి చోరీ చేసినట్లు కనిపిస్తోంది. ఆలయంలోని తలుపులు విరగ్గొట్టి లోపల ఉన్న వెండి ఆభరణాలు శఠగోపాలు రెండు, పాదాలు రెండు జతలు, పంచ పాత్రలు ఐదు, హారతి కుద్దిలు వంటివి దొంగతనం చేశారని, అలాగే హుండీలో సుమారు నగదు రూ.40 వేలు ఉంటుందని అర్చకుడు జగన్నాథం ఆచార్యులు తెలిపారు. స్వామి అలంకరణ వెండి వస్తువులు బీరువాలో ఉంచామని, ఆ వస్తువులన్నీ దొంగలు పట్టుకుపోయారని అన్నారు. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆలయం మూసివేసి ఇంటికి వెళ్లామన్నారు. వేకువజామున ఆలయానికి వెళ్లేసరికి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి స్థానికులకు, ఆలయ ఈఓ వాసుదేవరావుకు, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పాతపట్నం సీఐ నల్లి సాయి, పోలీసులు, ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, గుమస్తా సుదర్శనరావులు ఆలయానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించారు.

మలేరియా నివారణ చర్యలు


మలేరియా దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న సిబ్బంది

సరుబుజ్జిలి: మలేరియా వ్యాధినివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో ఏసీఎం దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ ద్రావణాన్ని విద్యాలయంలో గల 65 గదుల్లో స్ప్రే చేయించారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోష్‌కుమార్, సీహెచ్‌ఓ మోహనరావు, సబ్ యూనిట్ అధికారి ఆచారి, సూపర్‌వైజర్ శ్రీనివాస్,ఏఎన్‌ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'మాజీ వీసీ అక్రమాలపై విచారణ జరపాలి'




ధర్మపురం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పొందూరు: అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి చేపట్టిన అడ్డగోలు నియామకాలపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ చైర్ సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మపురం గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, మహిళా, వికలాంగుల, మైనార్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలుకు నిరసన వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్ల అమలు కోసం జూలై 1న నిర్వహించనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత నాయకులు కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు సీహెచ్ రాజు, బి.రాజేష్, ప్రసాదరావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి దర్శనానికి.. స్లాట్ బుకింగ్!

- ప్రతిపాదన దశలో ఉందన్న పూరి గజపతి మహారాజు
- భక్తుల రద్దీ క్రమబద్ధీకరణకు దోహదం


దివ్య సింగ్ దేవ్

భువనేశ్వర్: పూరీలోని జగన్నాథ దేవస్థానం నాలుగు ద్వారాలు తెరిచిన తర్వాత భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. ఈ రద్దీ క్రమబద్ధీకరించేందుకు రత్నవేదికపై దేవతల దర్శనం కోసం స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టాలని శ్రీ మందిరం పాలక మండలి యోచిస్తోందని పాలక మండలి అధ్యక్షుడు పూరి గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ శుక్రవారం తెలిపారు. మూలవిరాట్టుల దర్శనానికి శ్రీ మందిరం లోనికి ప్రవేశించడానికి ఆన్‌లైన్‌లో స్లాట్ల నమోదు ప్రతిపాదన ప్రారంభ దశలో ఉందని పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే సందర్శకుల రద్దీని నిర్వహించడంలో ఈ విధానం దోహదపడుతుందన్నారు. దర్శనం కోసం దీర్ఘకాలం వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి ఈ వ్యవస్థ సహాయపడుతుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో 3 గంటల పాటు స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరాల్సి వస్తుందని, ఆన్‌లైన్‌లో నిర్దిష్ట సమయాన్ని ఎంచుకుంటే భక్తులు శ్రీ క్షేత్రంలో ఇతర ప్రదేశాలను కూడా సకాలంలో సందర్శించేందుకు అవకాశముంటుందన్నారు.

ప్రత్యేకంగా మొబైల్ యాప్..

భక్తులు ముందుగానే దర్శన స్లాట్‌లను రిజర్వ్ చేసుకోవడానికి అనుకూలించే మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు దివ్య సింగ్ దేవ్ పేర్కొన్నారు. అయితే ఇంతవరకు ఈ విషయమై ప్రభుత్వ వైఖరి స్పష్టం కాలేదన్నారు. యాప్ అందుబాటులోకి వస్తే భక్తులు స్వయంగా మొబైల్ ఫోన్ ఉపయోగించి స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చన్నారు. భక్తుల సౌలభ్యం కోసం పూరి గజపతి మహా రాజా దివ్య సింగ్ దేవ్ ప్రతిపాదించిన స్లాట్ దర్శనం యాప్ పట్ల ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉన్నట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి. తుది నిర్ణయం తీసుకునే ముందు వాటాదారులను సంప్రదిస్తామని, కొత్తగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

చర్చనీయాంశంగా వీసీల రాజీనామాలు

ఎచ్చెర్ల క్యాంపస్: గత ప్రభుత్వ కాలంలో నియమితులైన వీసీల రాజీనామాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్రంలో గత రెండు రోజులుగా ఏడు విశ్వవిద్యాలయాల వీసీలు, రిజిస్ట్రార్లు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ సైతం రాజీనామా చేస్తారని ఒక వర్గం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. మరో పక్క ఉన్నత స్థాయిలో ఉన్న నాయకులు సైతం ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం ఈ అంశంపై సమాలోచనలు చేస్తున్నారు.